సాక్షి
విశాఖపట్నం
ఆదివారం | 27 | అక్టోబర్ | 2024



ఓపెన్ హౌస్‌కు స్పందన

నగర పోలీస్ కమిషనరేట్‌లో శనివారం జరిగిన ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. 8లో



రాణించిన ఆంధ్ర

రంజీ ట్రోఫీలో భాగంగా తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర ఆరు వికెట్లకు 275 పరుగులు చేసింది. 8లో



సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామిని సినీ నటి అన్న శనివారం దర్శించుకున్నారు. ఆమె మన్మథుడు, రాఘవేంద్ర తదితర సినిమాల్లో నటించారు. రైటర్ ప్రసన్నకుమార్ ఆమె వెంట ఉన్నారు.

హనీట్రాప్ కేసులో కూటమి ఎమ్మెల్యే?

- పోలీసులకు తలనొప్పిగా మారిన జాయ్ జమీనా కేసు
- రెండుసార్లు పోలీసులు కస్టడీకి తీసుకున్నా నోరు విప్పని యువతి
- ముఠాలో ఉన్న వారి వివరాల కోసం విశ్వప్రయత్నాలు
- వివరాలు గోప్యంగా ఉంచుతున్న పోలీసులు



విశాఖ సిటీ: హనీట్రాప్ కేసు వ్యవహారంలో కూటమి ఎమ్మెల్యే ఉన్నారా? బీజేపీ యువనేతలకు కూడా ఈ కేసుతో ప్రమేయముందా? వీరూ హనీట్రాప్ బాధితులా? లేదా యువతి ద్వారా వ్యాపారులను దోచుకుంటున్న సూత్రధారులా? ఇప్పుడివే సందేహాలు సర్వత్రా చక్కర్లు కొడుతున్నాయి. వ్యాపారులు, బిగ్ షాట్స్ లక్ష్యంగా జాయ్ జమీనా అనే యువతి వలపు వల విసిరి.. వీడియోలు, ఫొటోలతో బ్లాక్ మెయిల్ చేసి రూ.లక్షలు కాజేసిన కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ముందు వ్యాపారులు మాత్రమే ఆమె వలలో చిక్కుకున్నట్లు భావించినప్పటికీ.. ఆ జాబితాలో రాజకీయ నాయకులు కూడా ఉన్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ కేసు వివరాలు బయటకు వెల్లడించకుండా పోలీసులు అత్యంత గోప్యత పాటిస్తుండడం కూడా ఈ వాదనలకు బలాన్ని చేకూరిస్తోంది.

వలపు వల విసిరి.. రేప్ కేసు పెట్టి..

జాయ్ జమీనా కోసం ఎన్‌ఆర్‌ఐ యువకుడు అమెరికా నుంచి వచ్చి.. ఆమె వలలో చిక్కుకొని రూ.లక్షలు పోగొట్టుకున్నాడని.. అతడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హనీట్రాప్ వ్యవహారం బట్టబయలైంది. అప్పటి నుంచి ఈ కేసు పోలీసులకు తలనొప్పిగా మారింది. విచారణలో ఆమె వ్యవహరించిన తీరు పట్ల పోలీసులు విస్తుపోయారు. ఎన్ని రకాలుగా ప్రశ్నించినా ఆమె నోరువిప్పనట్లు తెలిసింది. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి.. గతంలో ఈ తరహా కేసులు ఎక్కడైనా నమోదయ్యాయా? అని దృష్టి పెట్టారు. ఈ క్రమంలో గతంలో ఆమె ఒక వ్యక్తిపై పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో రేప్ కేసు నమోదు చేసినట్లు గుర్తించారు. ఆ కేసు వివరాలను ఆరా తీయడంతో హనీట్రాప్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు ఆమెను భీమిలి పోలీస్‌స్టేషన్‌లో విచారించినప్పటికీ ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం చెప్పనట్లు సమాచారం. దీంతో ఆమెను అరెస్టు చేసి కోర్టుకు ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు. ఇంతలో కంచరపాలెం, ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా ఆమె ఇద్దరి వ్యాపారులను ఇదే తరహాలో మోసం చేసినట్లు ఫిర్యాదు అందాయి.

బాధితులా.. సూత్రధారులా..

హనీట్రాప్ కేసు విషయంలో పోలీసుల వ్యవహారశైలి అనేక అనుమానాలకు తావిస్తోంది. బాధితుల ఫిర్యాదు నమోదు నుంచి నిందితురాలి కస్టడీ విచారణ వరకు అన్నింట్లోను పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. ఈ కేసులో కూటమి ఎమ్మెల్యేతో పాటు బీజేపీ యువనాయకులు కూడా ఉన్నారన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వీరు నిందితురాలి ట్రాప్‌లో చిక్కుకున్న బాధితులా? లేదా ఆమె వెనుక ఉన్న సూత్రధారులా? అన్న సందేహాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అందువల్లే పోలీసులు ఈ కేసు వివరాలను బయటకు వెల్లడించడం లేదన్న వాదనలు ఉన్నాయి.

స్ప్రే కొట్టి.. ముగ్గులోకి దించి..

జాయ్ జమీనా ట్రాప్‌లో చిక్కుకున్న వారు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. ఆమె వ్యాపారులను దోచుకున్న తీరుపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముందుగా రెస్టారెంట్, కాఫీషాప్, రాజకీయ నేతలు ఇలా ఆర్థికంగా బలమైన వారినే ఎంచుకుంది. వారిని ఏదో ఒక విధంగా పరిచయం చేసుకొని, ఫోన్ నెంబర్ తీసుకొని, కవ్వింపు మాటలతో ముగ్గులోకి దింపేది. ఒక రోజు వారితో కారులో బయటకు వెళ్లడం.. ఆ సమయంలో వారి ముఖంపై ఒక రసాయనాన్ని స్ప్రే చేయడం.. ఇంటికి తీసుకువెళ్లడం.. వారు వద్దన్నా డ్రింక్ లేదా కాఫీ బలవంతంగా తాగించడం.. ఆ తరువాత బాధితులు మత్తులోకి జారిపోవడం.. లేచి చూసేసరికి ఆమెతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు చూపించి బ్లాక్ మెయిల్ చేయడం.. రూ.లక్షలు డిమాండ్ చేయడం.. పెళ్లి చేసుకోమని కత్తితో బెదిరించడం.. డబ్బు ఇవ్వని వారిపై రేప్ కేసు పెట్టడం.. ఇదే తరహాలో అనేక మందిని ఆమె దోచుకున్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. ఈ జాబితాలో వ్యాపారులు, ఎన్‌ఆర్‌ఐలతో పాటు రాజకీయ నేతలు సైతం ఉన్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి.

రెండు సార్లు కస్టడీకి తీసుకున్నా..

జమీనా నుంచి పూర్తి వివరాలు రాబట్టేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే భీమిలి స్టేషన్‌లో నమోదైన కేసులో ఆమె అరెస్టయింది. కోర్టు ద్వారా ఆమెను కస్టడీకి తీసుకొని విచారించారు. ఆమె వెనుక ఉన్న ముఠా సమాచారం కోసం పోలీసులు ఎన్ని విధాలుగా ప్రశ్నించినా.. నోరు విప్పడం లేదని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆమె ల్యాప్‌టాప్, మొబైల్‌లో ఉన్న సమాచారం సేకరించడానికి చేసిన ప్రయత్నాలు కూడా బెడిసికొట్టినట్లు తెలుస్తోంది. పోలీసుల ప్రశ్నలకు సమాచారం చెప్పాల్సిన అవసరం తనకు లేదని, నచ్చింది చేసుకోమని ఆమె సమాధానమివ్వడంతో పాటు తిరిగి వారినే బెదిరిస్తూ మాట్లాడినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కస్టడీ సమయం ముగియడంతో ఆమెను మళ్లీ జైలుకు పంపించారు. అయితే కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక కాఫీషాప్ యజమాని ఫిర్యాదుపై నమోదైన కేసులో కూడా గత రెండు రోజుల క్రితం ఆమెను రెండోసారి కస్టడీకి తీసుకున్నారు. ఇక్కడ కూడా ఆమె నుంచి వివరాలు రాబట్టడానికి ప్రయత్నించారు.

తెన్నేటి పార్కులో షూటింగ్



కొమ్మాది: తెన్నేటి పార్కు వద్ద శనివారం సాయంత్రం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సంబంధించి హీరో సందీప్ కిషన్, హీరోయిన్ రీతూవర్మలపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. మరో నాలుగు రోజుల పాటు ఈ ప్రాంతాల్లో షూటింగ్ ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.

జిల్లా న్యాయమూర్తికి పదోన్నతి

విశాఖ లీగల్: గాజువాక ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవితకు అదనపు జిల్లా న్యాయమూర్తిగా పదోన్నతి లభించింది. ఆమెను గాజువాక 13వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

న్యూస్‌రీల్

టూరిజం ప్రాజెక్టులు వేగవంతం చేయాలి

ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ ఆదేశం



ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీకి మెమొరాండం అందిస్తున్న ఏపీ టూరిజం ఫోరం ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: డివిజన్ పరిధిలో జరుగుతున్న పర్యాటక ప్రాజెక్టుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీటీడీసీ చైర్మన్ డా.నూకసాని బాలాజీ అధికారులను ఆదేశించారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం టూరిజం అధికారులతో సమావేశమైన ఆయన విశాఖ డివిజన్ రివ్యూ నిర్వహించారు. పర్యాటక రంగంలో అభివృద్ధి కార్యక్రమాలు, పునరుద్ధరణ పనుల గురించి ఆరా తీశారు. ప్రతి ప్రాజెక్టు నిర్దిష్ట సమయానికి పూర్తి చేయాలన్నారు. సమీక్ష అనంతరం అప్పుఘర్‌లో ఉన్న టూరిజం హోటల్ పునరుద్ధరణ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమీక్షలో విశాఖపట్నం రీజనల్ డైరెక్టర్, డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్‌పాణి, ఏపీటీడీసీ బోర్డు డైరెక్టర్ సుబ్బలక్ష్మి, ఏపీ టూరిజం ఫోరం అధ్యక్షుడు విజయ్‌మోహన్, ఏపీ టూరిజం ఫోరం సెక్రటరీ పవన్ కార్తీక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక అభివృద్ధికి సంబంధించి ఉన్న అవకాశాలు, వనరులు, రాబోయే టూరిజం పాలసీకి సంబంధించిన సలహాలతో కూడిన మెమొరాండంని టూరిజం ఫోరం ప్రతినిధులు చైర్మన్ బాలాజీకి అందించారు.

డీఈవోగా ప్రేమ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



పూర్వ డీఈవో చంద్రకళను సత్కరిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, సిబ్బంది

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖాధికారిగా ప్రేమ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఆయన్ని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు కలసి పుష్పగుచ్ఛాలను అందజేసి, అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బదిలీ అయిన డీఈవో చంద్రకళను సత్కరించారు.

కలెక్టర్‌ను కలిసిన డీఆర్వో భవానీశంకర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఆర్వో

మహారాణిపేట: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో), అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా బి.హెచ్ భవానీశంకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా భవానీశంకర్‌కు కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన కె.మోహన్‌కుమార్ చిత్తూరు డీఆర్వోగా బదిలీ అయిన సంగతి తెలిసిందే.

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రాక రేపు

మహారాణిపేట: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈనెల 28న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి ఇండిగో విమానంలో రాత్రి 7.55 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా నొవోటెల్ హోటల్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 29న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగే రోజ్‌గార్ మేళాలో పాల్గొంటారు. సాయంత్రం 4.35 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళ్తారు.

తల్లిదండ్రుల ప్రమేయంతోనే విద్యార్థుల ఉన్నతి

- నవంబర్ 14న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విజయవంతం చేయాలి
- సమీక్షలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో డీఈవో ప్రేమ్ కుమార్

మహారాణిపేట: తల్లిదండ్రుల ప్రమేయం ఉంటేనే విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. నవంబర్ 14న నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ సమావేశంలో దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ మీటింగ్‌కు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఐడీ క్రియేట్ చేసి, ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నారు. నవంబర్ 14న నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కోసం ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పేరెంట్ టీచర్ సమావేశంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ప్రమేయం కల్పించాలని, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. సమావేశానికి ముందుగానే ఉపాధ్యాయులు విద్యార్థుల వివరాలు సిద్ధం చేయాలన్నారు. ఆధార్ అప్‌డేషన్ కోసం విద్యార్థులకు ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, ఉప విద్యాశాఖ అధికారి రవీంద్రబాబు, పలువురు ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణానికి సిఫారసు చేయలేదు

- ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తా
- డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ హెచ్చరిక



దాబాగార్డెన్స్: నగరంలో ఎక్కడ కూడా బాణసంచా దుకాణం కోసం తాను సిఫారసు చేయలేదని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ స్పష్టం చేశారు. 22వ వార్డు జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ చేసిన ఆరోపణలు అవాస్తవమని శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో ఉన్న వారు ఎటువంటి ఆధారాలు లేకుండా ఎదుటి వ్యక్తులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేస్తే కోర్టు ద్వారా పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

ఫుడ్‌కోర్టును ప్రక్షాళన చేయాలి

నగరంలో పాత జైల్‌రోడ్డు, వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్క్ వద్ద గల ఫుడ్ కోర్టును ప్రక్షాళన చేయాలని మొదటి నుంచి తానే పలు కౌన్సిల్ సమావేశాల్లో డిమాండ్ చేశానని సతీష్ తెలిపారు. తాను ప్రస్తుతం ఫుడ్ కమిటీ చైర్మన్‌గా కూడా ఉన్నానని గుర్తు చేశారు. అక్కడ 120 నుంచి 160 దుకాణాలు ఉన్నాయని, అక్కడ దందా చేస్తోంది జనసేన నాయకులేనన్నారు. వీరిని తొలగించి అర్హులైన వారికి దుకాణాలు కేటాయించాలని సూచించారు. పాత వారిలో ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు అన్నది జీవీఎంసీ అధికారులు మాత్రమే తేల్చాల్సిన విషయమని సతీష్ స్పష్టం చేశారు. ఈ మేరకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గత కమిషనర్‌ని కోరానని గుర్తు చేశారు. ఫుడ్ కోర్టు దుకాణాల ద్వారా జీవీఎంసీకి ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

క్రీడాకారులకు వసతి, సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్‌కు క్రీడాసంఘాల వినతి

విశాఖ స్పోర్ట్స్: క్రీడాకారులకు వసతితో పాటు సదుపాయాలు కల్పించాలని జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో క్రీడామైదానాల ఏర్పాటు, క్రీడల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలపై కలెక్టర్ చర్చించారు. జిల్లాలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, హాకీ ఆస్ట్రోటర్ఫ్, మల్టీ పర్పస్ ఇండోర్ హాల్, ఫుట్‌బాల్‌కు గ్రౌండ్ తదితర అంశాలపై సంఘాల వినతికి ప్రతిస్పందిస్తూ.. తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానన్నారు. బీచ్‌లో జరిగే క్రీడాంశాల నిర్వహణకు తగిన విధంగా సహాయసహకారాలు అందించాలని ఆయా సంఘాల ప్రతినిధులు కోరారు. జిల్లాలో ఒలింపిక్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, జాతీయ అంతర్జాతీయ క్రీడల నిర్వాహణకు తగిన విధంగా సహకారం అందించాలని ఒలింపిక్ సంఘం ప్రతినిధులు విన్నవించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఎమ్మెల్యే పి.వి.జి.ఆర్ నాయుడు, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, శాయ్, ఎస్‌టీసీ, ఈకోర్‌రైల్వే, పోర్ట్ ట్రస్ట్, ఏయూ ప్రతినిధులు, ద్రోణాచార్య అవార్డులు గ్రహీతలు, అంతర్జాతీయ ఆటగాళ్లతో పాటు పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాణించిన ఆంధ్ర

- రషీద్, విహారి, భరత్ అర్ధ సెంచరీలు
- విశాఖలో హిమాచల్‌ప్రదేశ్‌తో ఆంధ్ర రంజీ మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: రంజీ ట్రోఫీలో భాగంగా ఎలైట్ బీ గ్రూప్‌లో హిమాచల్ ప్రదేశ్‌తో తలపడుతున్న ఆంధ్రా జట్టు.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లకు 275 పరుగులు చేసింది. ఇక్కడి వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన హిమాచల్‌ప్రదేశ్ లక్ష్య ఛేదనకే మొగ్గుచూపడంతో ఆంధ్ర తొలుత బ్యాటింగ్‌కు దిగింది. 11 పరుగులకే ఓపెనర్లు అభిషేక్‌రెడ్డి(5), మహీప్‌కుమార్(4)లు లెగ్ బిఫోర్ వికెట్లుగా రిషిధావన్‌కు దొరికిపోయారు. కెప్టెన్ రషీద్ (9 ఫోర్లతో 69) హనుమ విహారి(12 ఫోర్లతో 66) అర్ధసెంచరీలతో రాణించి స్కోర్‌ను 136 పరుగులకు చేర్చారు. వీరి జోడీ మూడో వికెట్‌కు 125 పరుగులు చేసింది. తర్వాత వచ్చిన భరత్ 65(ఎనిమిది ఫోర్లు, మూడు సిక్సర్లు) పరుగులు చేసి వెనుదిరగ్గా.. అశ్వినిహెబ్బర్ 15 పరుగులు చేశాడు. వీరిద్దరూ శర్మ బౌలింగ్‌లో పెవిలియన్‌కు చేరారు. రషీద్‌ను గులేరియా ఎల్‌బీడబ్ల్యూ చేయగా.. విహారీని ముకుల్ వెనక్కి పంపాడు. మనీష్(31), విజయ్ (20) జోడీ 50 పరుగుల భాగస్వామ్యంతో క్రీజ్‌లో నిలిచారు. ఆట మరో మూడు రోజుల పాటు సాగనుంది.



సెంచరీ భాగస్వామ్యం అందించిన కెప్టెన్ రషీద్, హనుమ విహారి జోడీ



స్నిఫర్ డాగ్స్ పనితీరు వివరిస్తున్న పోలీసు అధికారి



గన్‌ల గురించి విద్యార్థులకు వివరిస్తున్న సిబ్బంది



ఫింగర్ ప్రింట్ సిస్టమ్ గురించి వివరిస్తున్న సిబ్బంది

• ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌కు స్పందన

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నగర పోలీస్ కమిషనరేట్‌లో శనివారం జరిగిన ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు లైట్ మెషీన్ గన్‌లు, అధునాతన రైఫిల్స్, ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, కార్బన్, 9 ఎంఎం పిస్టల్, బీడీ టీమ్, క్లూస్ టీమ్, బాంబు డిటెక్షన్ పరికరాలు, అనేక రకాల ఆయుధాలు, ఫింగర్ ప్రింట్ యంత్రాల పనితీరు, వినియోగం గురించి వివరించారు. విద్యార్థులు వాటిని ఆసక్తిగా పరిశీలించి.. వాటిపై తమకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. స్నిఫర్ డాగ్స్ పేలుడు పదార్థాలను గుర్తించే సామర్థ్యాన్ని ఈ సందర్భంగా ప్రదర్శించాయి. -అల్లిపురం

గిరిజనుల జీవన ప్రమాణాల పెంపునకు కృషి చేద్దాం

- జీసీసీ ఎండీతో భేటీ అయిన అరకు ఎంపీ తనూజరాణి
- సమస్యలు ప్రస్తావిస్తూ.. పరిష్కార మార్గాల సూచన



జీసీసీ ఎండీతో చర్చిస్తున్న అరకు ఎంపీ తనూజరాణి, చెట్టి వినయ్

సాక్షి, విశాఖపట్నం: గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా జీసీసీ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తూ.. గిరిజన ప్రాంత సమగ్రాభివృద్ధికి సహకరించాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి సూచించారు. గిరిజన సహకార సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జీసీసీ ప్రధా న కార్యాలయాన్ని శనివారం సందర్శించిన ఎంపీ.. జీసీసీ ఎండీ కల్పనాకుమారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులకు సంబంధించిన పలు సమస్యలను ఎండీతో ప్రస్తావిస్తూ.. పరిష్కార మార్గాలను కూడా వివరించారు. దళారీ వ్యవస్థ నుంచి కాపాడుతూ గిరిజనులకు జీవనోపాధిని కల్పించేందుకు కృషి చేయాలన్నారు. అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి వెనువెంటనే విక్రయించకుండా జాప్యం చేస్తుండటంతో టర్నోవర్ పెరగక నష్టం వాటిల్లుతోందన్నారు. అంతర్జాతీయ కాఫీ ధరలను దృష్టిలో పెట్టుకుని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని.. ప్రస్తుతం పెంచిన ధరలపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. డివిజనల్, గిరిజన ప్రాథమిక పరపతి సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కాఫీ గింజలు సేకరించిన 24 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు నేరుగా జమ అయ్యేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. జీసీసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ప్రమోషన్లు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. కొన్ని అనాలోచిత నిర్ణయాలతో అధికారులు, ఉద్యోగులు జీసీసీని నష్టాల బాట పట్టిస్తున్నారని ఎండీకి ఫిర్యాదు చేశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పార్లమెంట్ సాక్షిగా గళం విప్పి.. గిరిజనుల హక్కులు, జీసీసీకి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ అంశాలకు సంబంధించి విభాగాల వారీగా ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపడతామని జీసీసీ ఎండీ కల్పన హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ పాల్గొన్నారు.

చోరీలు చేసిన వ్యక్తికి ఏడాది జైలు

విశాఖ లీగల్: చోరీ చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నగరంలో ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎం.ప్రదీప్‌కుమార్ శనివారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.8వేలు జరిమనా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మరో రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలివీ.. నిందితుడు గురక తాతాజీ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెదజాలారిపేటలో నివసిస్తున్నాడు. సున్నపువీధితోపాటు పలు ప్రాంతాల్లో రూ.1,20,000 విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశాడు. ఈ చోరీ సొత్తును నిందితుడు నుంచి పోలీసులు స్వాధీనం చేసుకుని.. భారతీయ శిక్షాస్మృతి 411 కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇండస్ట్రీస్ అడిషనల్ డైరెక్టర్ ఎ.వి.పటేల్

అక్కిరెడ్డిపాలెం: ఎస్సీ, ఎస్టీలు పరిశ్రమల స్థాపనలో ఇంకా ఎదగాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎ.వి.పటేల్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎన్నో రాయితీలు కల్పిస్తున్నాయని తెలిపారు. ఆటోనగర్‌లోని వాసీవా భవనంలో విశాఖ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరిగింది. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి అతిథులు, అసోసియేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పలు రకాల ఉత్పత్తులు, నిర్మాణాలు, తయారీ రంగాల వస్తువులపై వర్తించే జీఎస్టీలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ రూపంలో వచ్చే ఆదాయాన్ని డెమో ద్వారా వివరించారు. డీఐసీ జీఎం ఆదిశేషు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనల్లో సహకారం, పూచీకత్తులేని రుణాల మంజూరు, వర్తించే రాయితీలు, ఉత్పత్తుల ఎంపిక, మార్కెటింగ్ సపోర్టు, ఇండస్ట్రీయల్ పాలసీ, తీసుకోవాల్సిన అనుమతులు గురించి వివరించారు. ఏపీఐఐసీ జెడ్ఎం జయబాబు.. ఏపీఐఐసీ పరిధిలో పారిశ్రామిక ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేటాయించే స్థలాలు, ఎంత శాతం చెల్లించాలి వంటి అంశాలను వివరించారు. 13 ఏళ్లగా దళిత పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్న పటేల్‌ను ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కోశాధికారి పద్మావతి తదితరులు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఆర్‌డీసీ డైరెక్టర్ సాహూ, పారిశ్రామిక వేత్త డాక్టర్ తెన్నేటి జయరాజ్, ఐలా కమిషనర్ కిశోర్, ఎంఎస్ఎంఈ ఏడీలు చంద్రమౌళి, బి.ప్రభాకర్ కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్టీఆర్ వైద్య సేవ పథకం అమలు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో నిబంధనలకు అనుగుణంగా ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగులకు చికిత్సలు అందించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆస్పత్రి యాజమాన్యాలను ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రుల డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని, లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇండస్, మెడికవర్, అనిల్ నీరుకొండ, కిమ్స్ ఐకాన్, దమయంతి దుర్గా, గాజువాక ఆర్కే హాస్పిటల్ ప్రతినిధులు హాజరై.. ఎన్టీఆర్ వైద్య సేవలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. కలెక్టర్ పలు ఆస్పత్రులపై వచ్చిన ఫిర్యాదులను విచారించి జరిమానా విధించారు. డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

విద్య, నైపుణ్యాలకు మధ్య అగాథం తగ్గిస్తాం

ఎంపీ శ్రీభరత్



మాట్లాడుతున్న ఎంపీ శ్రీ భరత్

ఏయూక్యాంపస్: నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరతను పరిశ్రమలు ఎదుర్కొంటున్నాయని.. దీనిని అధిగమించే దిశగా విద్య, నైపుణ్యాలకు మధ్య ఉన్న అగాథాన్ని తగ్గిస్తామని ఎంపీ ఎం. శ్రీభరత్ అన్నారు. బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం రాష్ట్రంలో నూతన అవకాశాలను అన్వేషించడం–పెట్టుబడుల విధానాలపై సహకరించడం అనే అంశంపై సదస్సు జరిగింది. వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, టూర్స్ అండ్ ట్రావెల్ ఆపరేటర్స్ ఆఫ్ ఏపీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. రాష్ట్ర విద్యా శాఖ.. పరిశ్రమలతో విద్యా రంగాన్ని అనుసంధానించి నైపుణ్యలేమిని నివారించే ప్రయత్నం చేస్తోందన్నారు. సీఎస్సార్ నిధులు అందిస్తే బీచ్‌లో సీసీ కెమెరాలు, లైటింగ్ వ్యవస్థను మరింత మెరుగుపరుస్తామన్నారు. తద్వారా రాత్రి వేళల్లో బీచ్‌లో సందర్శకులను అనుమతించే అవకాశం ఉంటుందన్నారు.

వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ ఒ.నరేష్ కుమార్ మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాల తరహాలో రాయితీలు కల్పించడం, నూతన ఇండస్ట్రియల్ పార్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఏపీ మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి జిల్లాకు ఒక పోర్ట్ ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు.

ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర్ మాట్లాడుతూ యువత ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదిగే దిశగా ఆలోచన చేయాలన్నారు. ఏపీటీడీసీ చైర్మన్ ఎన్.బాలాజీ మాట్లాడుతూ త్వరలో నూతన టూరిజం పాలసీని తీసుకువస్తామన్నారు. 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్ వికసిత భారత్, వికసిత్ ఏపీ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ చాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ జి.సాంబశివరావు, టూర్స్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్ మోహన్, భాస్కరరావు, ప్రకాష్, ప్రసాద్, పవన్ కార్తీక్, తరుణ్ కాకాని తదితరులు మాట్లాడారు.

పత్తాలేని ఎమ్మెల్యేపై ఆగ్రహం

- మద్యం షాపు వద్దంటూ వారం రోజులుగా ఆందోళన
- ఎమ్మెల్యే వంశీకృష్ణకు ప్రజా సమస్యలు పట్టవని ఆరోపణ
- విద్యార్థులు, మహిళల నిరసన



భూపేష్‌నగర్ వద్ద మద్యం షాపు వద్దని నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, మహిళలు

అల్లిపురం: 'నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు ఏర్పాటు చేస్తుండడంతో వారం రోజులుగా ధర్నా చేస్తున్నాం. కనీసం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్పందించడం లేదు. ప్రజలకు బాసటగా నిలవాల్సిన ఎమ్మెల్యే కనిపించకపోవడంతో ఐద్వా, మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అసలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉన్నట్టా.. లేనట్టా? అనుమానం వ్యక్తమవుతోంది' అని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత శనివారం రాత్రి నుంచి చావులమదుం వద్ద మహిళలు, చిన్నారులు మద్యం షాపు వద్దంటూ ఆందోళన చేపడుతున్నారు. వారికి ఐద్వా, మహిళా సంఘాలు మద్దతుగా నిలిచాయి. శనివారం భూపేష్‌నగర్‌లో విద్యార్థులు ఆందోళన చేపట్టగా.. వారికి ఎస్ఎఫ్ఐ, సీపీఎం ప్రతినిధులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇప్పటికే నాలుగు మద్యం షాపులున్నాయని.. దీని వల్ల ఆకతాయిల ఆగడాలు పెరిగిపోయాయన్నారు. వాటిని నియంత్రించేందుకు టూటౌన్ పోలీసులు అవుట్ పోస్టు ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు ఆ అవుట్ పోస్టు పక్కనే మద్యం షాపు తెరుస్తున్నా పోలీసులు అడ్డుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నగర పోలీస్ కమిషనర్ దీనిపై దృష్టి పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు అఖిల్, అజయ్, కుశ్వంత్, భరత్, ధనుంజయ్, హేమంత్, మహిళా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు.



ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నగరంలో శనివారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా.. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి. సబ్బవరం మండలంలో భారీ వర్షం కురిసింది. అక్కడ లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి.

అద్దె బస్సు డ్రైవర్లకు సకాలంలో వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: అద్దె బస్సు డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ వర్కర్లకు చట్ట ప్రకారం చెల్లించాల్సిన జీతాల కంటే తక్కువ చెల్లిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు అన్నారు. వారికి ఇవ్వాల్సిన జీతాలు సకాలంలో చెల్లించాలని ఆదేశించారు. ఆర్టీసీ అద్దె బస్సు యజమానులు, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్లతో జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దె బస్సు యజమానులు, అవుట్ సోర్సింగ్ వర్క్స్ కాంట్రాక్టర్ల సమస్యలు తెలుసుకుని, వాటిని చట్ట పరిధిలో పరిష్కరిస్తామన్నారు. బస్సుల నిర్వహణ క్రమపద్ధతిలో చేపట్టాలని, సమయ పాలన పాటించాలని, నిర్దేశించిన బస్టాపుల్లో బస్సులు ఆపాలని డ్రైవర్లకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, ద్వారకా బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీబీఎంకే రాజు, పర్సనల్ ఆఫీసర్ జి.తిరుపతినాయుడు, అసిస్టెంట్ మేనేజర్లు జి.శ్రీధర్, ఎస్ఎస్‌డి ప్రసాద్, పలువురు ఆర్టీసీ అద్దె బస్సు యజమానులు, అవుట్ సోర్సింగ్ వర్క్స్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రేపు పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయని, వివరాలకు 94906 32318లో సంప్రదించాలని సూచించారు. https:// forms.gle/YRf3uYzN3hzvwZ5Q8 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. **వివరాలివీ..**

- బీడేటా టెక్నాలజీస్‌లో 20 బెంచ్ సేల్స్ రిక్రూటర్, 20 యూఎస్ ఐటీ రిక్రూటర్ పోస్టులకు డిగ్రీ లేదా ఎంబీఏ చేసిన వారు అర్హులు. వీరికి రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వార్షిక ప్యాకేజీ ఉంటుంది. మధురవాడ లేదా హైదరాబాద్‌లో పనిచేయాలి. వయోపరిమితి 35 సంవత్సరాలు.
- మోల్‌బయో డయాగ్నస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100 మంది మెడికల్ డివైస్ మ్యాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్ పోస్టులకు ఐటీఐ లేదా డిప్లమో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ చేసిన వారు అర్హులు. 2017–2024 మధ్య రిలీవ్ అయి 18–28 ఏళ్ల వయసు ఉన్న పురుషులు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరుకావాలి. ఎంపికైన వారికి రూ.2.24 లక్షల వార్షిక ప్యాకేజీ ఉంటుంది. గాజువాకలో ఏఎంటీజెడ్‌లోని కంపెనీలో పనిచేయాల్సి ఉంటుంది.
- నిధి ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 20 టెలీ సేల్స్ అడ్వైజర్ పోస్టులకు ఇంటర్ ఆపై విద్యార్హత కలిగిన 18–28 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులు. అనుభవాన్ని బట్టి రూ.1.2 లక్షల నుంచి రూ.1.44 లక్షల వార్షిక ప్యాకేజీ ఉంటుంది. ద్వారకానగర్‌లోని కార్యాలయంలో పని చేయాలి.